సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 17 । జూలై । 2025



కారాగారంలో సెల్‌ఫోన్.. రచ్చ

కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్ లభ్యం కావడంపై రచ్చ రేగుతోంది. తాను డబ్బులు ఎరవేశానంటూ రిమాండ్ ఖైదీ తెలియజేసినట్లు సమాచారమొచ్చింది. -8లో



సమస్య పరిష్కరించుకునే ప్రక్రియే మధ్యవర్తిత్వం

కక్షి దారుల సమస్యలను పరిష్కరించుకునే ప్రక్రియనే మధ్యవర్తిత్వం అంటారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని అన్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.2/26.6

జిల్లాలో బుధవారం 26.6 – 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 13.16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

యువతకు ఉచిత శిక్షణ



కడప కోటిరెడ్డి సర్కిల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలల కోర్సుకు సంబంధించి పదవ తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు ఈనెల 17వ తేదీలోపు తమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9392348430 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం



కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్ కళాశాల)లో పొలిటికల్ సైన్సు, హిస్టరీ, ఎకనామిక్స్, జియాలజి, కంప్యూటర్ సైన్సు/అప్లికేషన్ సబ్జెక్టులకు అతిథి అధ్యాపక ఉద్యోగాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు జూలై 18వ తేదీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు ప్రిన్సిపాల్ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ కలిగి ఉండాలని వివరించారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్టు జిరాక్సు కాపీలతో హాజరు కావాలని ఆయన సూచించారు.

సికింద్రాబాద్ – తిరుపతి మధ్య ప్రత్యేక రైలు



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ – తిరుపతి మధ్య ప్రత్యేక రైలు నడుపుతున్నారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు. 07009 నంబరుగల రైలు ప్రతి గురువారం సికింద్రాబాద్‌లో ఈనెల 31, ఆగస్టు 7, 14, 21, 28వ తేదీల్లో, 07010 నంబరు గల రైలు తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి శుక్రవారం ఆగస్టు 1, 8, 15, 22, 29వ తేదీల్లో నడుస్తుందన్నారు. సికింద్రాబాద్‌లో ప్రతి గురువారం రాత్రి 10గంటలకు బయలుదేరి కాచిగూడ, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల మీదుగా కడపకు ఉదయం 7.05గంటలకు చేరుకుని, రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి ఉదయం 10.30గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే ప్రతి శుక్రవారం తిరుపతిలో సాయంత్రం 4.40గంటలకు బయలుదేరి ఇదే మార్గంలో సికింద్రాబాద్‌కు ఉదయం 6.45గంటలకు చేరుతుందని ఆయన తెలిపారు. ఇప్పటికే రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


మేఘుమా కురవవే!

- ముఖం చాటేసిన వరుణుడు
- వర్షం కోసం రైతులు ఎదురు చూపులు
- విపరీతంగా వీస్తున్న ఈదురుగాలులు



పంటలసాగుకు సిద్ధంగా ఉన్న భూమి





మేఘావృతమైన ఆకాశం

కడప అగ్రికల్చర్: ఆకాశమంతా మబ్బులు...నేలంతా చిత్తడి.. రోజంతా ముసురు.. ఇలా చల్లగా ఉండాల్సిన జూలై నెలలో ఎండలు మండుతున్నాయి. అసలిది వానాకాలమా.. ఎండాకాలమో అనే అనుమానం కలుగుతోంది. దీనికి తోడు ఉక్కపోత. ఇది చాలదన్నట్లు గంటకు 25 నుంచి 30 కిలో మీటర్ల వేగంలో గాలులు వీస్తున్నాయి. ఫలితంగా భూగర్భ జలాలు సైతం అడుగంటిపోతున్నాయి. దీంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందు వర్షాలు కురిశాయి. ఈ ఏడాది ఇక వర్షాలకు కొదవ ఉండదనుకున్న అన్నదాతల ఆశలు ఆదిలోనే అడియాసలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన తర్వాత వానదేవుడు పూర్తిగా ముఖం చాటేశాడు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు కాస్తా వాడుముఖం పడుతున్నట్లు పలువురు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక రుతుపవనాలు ఎప్పుడొస్తాయో వర్షాలు ఎప్పుడు కురుస్తాయో అని అన్నదాతలు నింగికేసి చూస్తున్నారు.

జిల్లాలో 6.52 శాతం పంటలు సాగు

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 77,475 హెక్టార్లలో సాధారణ సాగుగా అధికారులు ఖరారు చేశారు. సీజన్ ప్రారంభమై 45 రోజులు అయింది. ఇప్పటికి జిల్లావ్యాప్తంగా 6941.37 హెక్టార్లలో వివిధ పంటలు సాగై 6.52 శాతంగా పంటలసాగు నమోదయింది. ప్రస్తుతం జిల్లాలో 1571.43 హెక్టార్లలో వరిపంట, 358 హెక్టార్లలో సజ్జలు, 717.44 హెక్టార్లలో మొక్కజొన్న, 6 హెక్టార్లలో జొన్న, 42 హెక్టార్లలో కంది, 827.6 హెక్టార్లలో మినుము, 7 హెక్టార్లలో పెసర, 870.6 హెక్టార్లలో వేరుశనగ, 65.7 సన్‌ఫ్లవర్, 9.2 హెక్టార్లలో ఆముదం, 21 హెక్టార్లలో సోయాబీన్, 2429.07 హెక్టార్లలో పత్తి, 16 హెక్టార్లలో చెరకు మొత్తం కలిసి జిల్లావ్యాప్తంగా 6941.37 హెక్టార్లలో పంటలు సాగులో ఉన్నాయి.

లోటు వర్షపాతమే...

ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సంవృద్ధిగా వర్షాలు కురవలేదు. దీంతో పంటలు వాడుముఖం పడుతున్నాయి. దీనికితోడు ప్రస్తుతం సాగు చేయాల్సిన వేరుశనగ, పసుపు, మినుము, జొన్న, సజ్జ, వరి వంటి పంటలసాగు అనుకున్న మేర సాగు కాలేదు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు కూడా వాడుముఖం పడుతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా జూన్ నెలలో 68.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 22.8 మి.మీ మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 66.6 శాతం తక్కువ వర్షం కురిసింది, అలాగే జులై నెలకు సంబంధించి ఇప్పటి వరకు 43.67 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికి 7.1 మి.మీ మాత్రమే కురిసి లోటు వర్షపాతంగా మిగిలింది.

కేసీ నీటితో కాస్త ఊరట

ఎగువన కురిసిన వర్షాలకు ఈ ఏడాది శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో ఈ ఏడాది సకాలంలోనే కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేశారు. దీంతో కేసీ కెనాల్ కింద ఇక సాగు పనులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం కేసీ కెనాల్ కింద సాగులో ఉన్న పంటలకు నీరు అందనుంది. దీంతోపాటు కేసీ రైతులు ఇక నారుమడులను సాగు చేయనున్నారు. కాకపోతే విపరీతమైన గాలులు వీస్తుంటంతో నారుముడులు సరిగా మొలకెత్తవని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నాటు వేసినా ఈ గాలికి సాగు చేసిన వరిపంట ఎండుముఖం పట్టే అవకాశం కూడా ఉన్నట్లు రైతులు తెలిపారు.



దువ్వూరు వద్ద కేసీ కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

సాగర్ పనుల్లో జాప్యమేల!

- గత ప్రభుత్వ హయాలో రూ.70 కోట్ల నిధులు విడుదల
- కూటమి ప్రభుత్వంలో ముందుకు సాగని పనులు



శిథిలావస్థలో పార్కులు



డయాఫ్రం వాల్ పనులు చేస్తున్న దృశ్యం (ఫైల్)

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్ ఆనకట్ట ఆధునికీకరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తెలుగు గంగలో అంతర్భాగమైన బ్రహ్మంసాగర్ ఆనకట్ట లీక్‌లను అరికట్టేందుకు 2021లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.70కోట్లు నిధులు విడదల చేసింది. ఈ నిధులద్వారా కట్టకు పడ్డ రంధ్రం మరమ్మతులు కట్టపైన బీటీ రోడ్డు, సేఫ్టీ గ్రిల్స్, లైటింగ్స్, పార్కుల ఆధునికీకరణ, గెస్టహౌస్ మరమ్మతులు తదితర పనులకు టెండర్లు పిలవగా మెగా కంపెనీ పనులు చేసేందుకు ముందుకు వచ్చింది.

లీకులు సరిచేసి..

టెండర్లు దక్కించుకున్న సదరు కంపెనీ ఆనకట్టకు పడ్డ రంధ్రం మరమ్మతులు చేసింది. 12 టీఎంసీ వరకు నీరు నిల్వ ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారు. ఇంతలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతే పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వం సదరు కంపెనీపై ఒత్తిడి తెచ్చి మిగిలిన పనులు చేయాలని ఆదేశించడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. పనులు పూర్తి చేస్తేనే బిల్లులు కూడా పూర్తి స్థాయిలో వస్తాయని అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా సాగర్ కట్టపైన మిగిలిన పనులు పూర్తిచేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.



బ్రహ్మంసాగర్

రీసర్వే పక్కాగా నిర్వహించాలి

ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్

కడప సెవెన్ రోడ్స్: జిల్లాలో భూ రీసర్వేను పక్కాగా నిర్వహించాలని మండల, గ్రామస్థాయిలో తహసిల్దార్లు సర్వేయర్లు, వీఆర్వోలను ఇంచార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. బుధవారం భూముల రీ సర్వే, రెవెన్యూ అంశాలపై అదనపు సీసీఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నక్కల ప్రభాకర్ రెడ్డి జాయింట్ కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇంచార్జి కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీలు ఎక్కడా పెండింగ్ లేకుండా చూడాలన్నారు. జిల్లాలో ఫేజ్ 1 లో ఉన్న భూముల రీసర్వే వేగవంతంగా, పకడ్బందీగా ఈ నెలాఖరు లోపల పూర్తి చేయాలన్నారు. భూముల రీసర్వే లో రెవెన్యూ, సర్వే ల్యాండ్ శాఖల అధికారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి క్షేత్రస్థాయిలో రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి తప్పనిసరిగా వ్యవసాయ అధికారులు ఆధార్ అప్డేషన్ చేయాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, సర్వే ల్యాండ్ అధికారి మురళీకృష్ణ,జిల్లా వ్యవసాయ శాఖ జేడి చంద్రా నాయక్,రెవెన్యూ అధికారులు, సర్వే ల్యాండ్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్చార్జి కలెక్టర్ అదితి సింగ్

ప్రభుత్వ సేవల్లో వేగం పెరగాలి

ప్రభుత్వ సేవల్లో వేగం, నాణ్యత పెరగాలని కింది స్థాయి అధికారులు నిర్లక్ష్యం వీడి పనితీరు మెరుగు పరచుకొని జవాబుదారీతనంతో పనిచేయాలని ఇన్చార్జి కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వీఆర్వోలు, సచివాలయ అడ్మిన్స్, వెల్ఫేర్ సెక్రటరీలు,మండల గ్రామ సర్వేయర్ల తో ఐవీఆర్ఎస్ లో వచ్చిన ఫీడ్ బ్యాక్ నివేదికల పనితీరు పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో కలిసి మెలిసి మమేకం కావాలని, చట్ట ప్రకారం ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల అందజేత, అర్జీలు పరిష్కారం చూపడంలో తీవ్ర జాప్యం చేయడం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ ఫీడ్ బ్యాక్ నివేదికలలో పనితీరు మెరుగ్గా లేని అధికారులపై తహసీల్దార్లు విచారణ పూర్తి చేసి రిపోర్ట్ అందజేయాలని ఆదేశించారు

రైతులపై ఇంత నిర్లక్ష్యమా!



ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

- ప్రాజెక్టులలో నీరు ఉన్నా రైతులకు ఎందుకివ్వడం లేదు
- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ధ్వజం

పులివెందుల: శ్రీశైలం, పీబీసీ, సీబీఆర్, గండికోట ప్రాజెక్టులపై ఇరిగేషన్ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులోని ఇరిగేషన్ డీఈ కార్యాలయానికొచ్చి అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టులలో నీరు పుష్కలంగా ఉన్నా రైతులకు సాగునీరు ఎందుకందించలేదని ప్రశ్నించారు. గత ఐదారేళ్లలో ఇలాంటి దారుణమైన పరిస్థితి ఎప్పుడు చూడలేదని అధికారులపై మండిపడ్డారు. దీనికి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదని సమాధానమిచ్చారు. దీనికి ఎంపీ స్పందిస్తూ గతంలో మోటార్లు పనిచేయలేదన్నారు..., ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడంలేదని కుంటి సాకులు చెబుతున్నారా అంటూ మండిపడ్డారు. రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు విలువ చేసే మరమ్మతులు కూడా చేయకుంటే ఎలా అని ప్రశ్నించారు. దీనివల్ల రైతులకు కోట్లాది రూపాయలు నష్టపోతారన్నారు. ఇలాంటి చిన్నపాటి రిపేర్లకు కూడా ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్లను రిపేరు చేయించి ఎర్రబల్లె చెరువు, భూమయ్యగారిపల్లె చెరువులకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

- అనంతరం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గండికోట, సీబీఆర్, పైడిపాలెం ప్రాజెక్టులలో నీరు పుష్కలంగా ఉన్నా ఆయకట్టు చెరువులకు నీరు విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. లింగాల చెరువు, ఎర్రబల్లె చెరువుకు సత్వరమే నీటిని విడుదల చేయాలని అధికారులను కోరామన్నారు. ఎర్రబల్లి చెరువును నీటితో నింపితే పది గ్రామాలకు లబ్ధి చేకూరుతుందని, ఈ విషయం గురించి రెండు నెలల నుంచి విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. మోటర్లు కాలిపోయాయని చెబుతున్నారని, తాము మోటార్లు రిపేరు చేయిస్తామని చెబితే ఒప్పుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వమే చేయాలి, కూటమి నాయకులే చేయాలంటున్నారు.. వారు చేయరు చేసేవారిని చేయనివ్వరని విమర్శించారు. చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లినా పులివెందులను హార్టికల్చర్ హబ్‌గా చేస్తానని గొప్పగా చెబుతుంటారని, కానీ పులివెందుల రైతులకు నీరు ఇవ్వడానికి మీనమేషాలు వేస్తున్నారని మండిపడ్డారు. ఉద్యాన పంటల సాగుపైనే ఆధారపడిన నియోజకవర్గానికి నీరు ఇవ్వకపోతే రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రతిరోజు కొత్తపల్లె, నల్లపు రెడ్డి పల్లె గ్రామాల్లో కొత్త బోర్లు వేయడం మొదలుపెట్టారని, రోజుకు 15 నుంచి 20 కొత్త బోర్లు వేస్తున్నారని, ప్రతిరోజు రైతులకు రూ.40లక్షల దాకా ఖర్చు అవుతోందన్నారు. ఇప్పటికైనా నిద్ర మేల్కొని సత్వరమే వాటర్ మేనేజ్మెంట్ పై శ్రద్ధ పెట్టాలని, సత్వరమే ఎర్రబల్లె చెరువు, భూమయ్యగారిపల్లె చెరువులను నీటితో నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, మండల నాయకులు సాంబశివారెడ్డి, బయపురెడ్డి, బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలు డీలా!

- నేటికీ జారీకాని ప్రవేశాల నోటిఫికేషన్
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌పై స్పష్టత కరువు
- సింగిల్, డబుల్ మేజర్ సబ్జెక్టులపై సందిగ్ధం
- ప్రభుత్వ ప్రకటన కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు ఎదురు చూపు



కడప ప్రభుత్వ పురుషుల కళాశాల



కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై మూడు నెలలు దాటింది. జూలై మాసం కూడా ముగుస్తోంది. ఇంతవరకు డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ ఊసే లేకుండా పోయింది. దీంతో వేలాది మంది విద్యార్థుల్లో ఆందోళనలతోపాటు గందరగోళం నెలకొంది. జిల్లావ్యాప్తంగా దాదాపు 10 వేల మందికిపైగా విద్యార్థులు డిగ్రీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 2024–25 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 12878 మందికిగాను 9698 మందికిపైగా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరితోపాటు పలువురు సప్లిమెంటరీ రాసి పాసైన వారు ఉన్నారు. వీరంతా డిగ్రీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు.

పూర్తి నిర్లక్ష్యం....

ఉన్నత విద్యపై కూటి సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం వహించింది.గతేడాది అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యంగా చేపట్టడంతో చాలా కళాశాలల్లో 40 నుంచి 50 శాతం సీట్లు మిగిలిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత అలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. జూన్ నెలలోనే పాఠశాలలు, ఇంటర్ కళాశాలలు ప్రారభమయ్యాయి, మరో వైపు డిగ్రీ కళాశాలలు కూడా నెల రోజుల క్రితమే పునః ప్రారంభమయ్యాయి. జిల్లాలో పలు ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మాత్రం గుట్టుగా అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టి చప్పుడు కాకుండా తరగతులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం చేయడం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ కళాశాలలు వెనకబడి పోతున్నాయి.

21న ప్రైవేటు డిగ్రీ కళాశాలలు బంద్

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ అలసత్వంపై ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ 21వ తేదీ ప్రైవేటు డిగ్రీ కళాశాల బంద్‌కు పిలుపునిచ్చింది. దేశవ్యాప్తంగా డిగ్రీ ప్రవేశాలు పూర్తయి తరగతులు ప్రారంభమైనా ఏపీ ప్రభుత్వం విద్యా ప్రణాళిక కూడా తీసుకరాలేకపోతోందని ఆరోపించింది. ఇందుకు నిరసనగానే 21వ కళాశాల బంద్‌ను నిర్వహించి నిరసనను తెలియ చేయనున్నారు.

ఉన్నత విద్య నిర్వీర్యం



కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే ఉన్నత విద్యను నిర్వీర్యం చేసేలా ఉంది. డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి ఇప్పటి వరకు నోటిఫికేషన్ జారీ చేయకపోవడం చాలా బాధాకరం. ప్రభుత్వ పెద్దల తీరుతో జిల్లావ్యాప్తంగా వేల మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దల్లో మార్పు రావాలి.

– సాయిదత్త, వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు

డిగ్రీ ప్రవేశాలను వెంటనే చేపట్టాలి



విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ప్రవేశాలను ప్రారంభించపోవడం సరికాదు. తెలంగాణాతో పాటు పొరుగు రాష్ట్రాలలో సైతం నెల రోజుల క్రితమే అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. కానీ మన దగ్గర అడ్మిషన్ల పక్రియ ఆలస్యమయింది. దీంతో డిగ్రీ చేరే విద్యార్థుల సంఖ్య తగ్గే అవకాశం ఉంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ ప్రవేశాలను ప్రారంభించాలి.

– వీరనాల శివకుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

డిగ్రీ విద్యపై కుట్ర



డిగ్రీ విద్యార్థులతో ప్రభుత్వం చెలగాటమాడుతోంది. సింగల్ మేజర్, డబుల్ మేజర్ అంటూ డిగ్రీ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోంది. ఇంజనీరింగ్ విద్యను ప్రోత్సహించి డిగ్రీ చదువును నిర్లక్ష్యం చేస్తుంది. డిగ్రీ విద్యను పాత పద్ధతిలో కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఇప్పుడు వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నారు. డిగ్రీ కోర్సులలో విద్యార్థులకు అభద్రతా భావం కల్పిస్తూ డిగ్రీ అడ్మిషన్లు తగ్గించే నిర్ణయాలు చేయడం తగదు.

–ఎస్. వెంకటరమణ, యోగివేమన ప్రైవేటు డిగ్రీ కాలేజీ యూనియన్ ప్రెసిడెంట్

వాటర్‌షెడ్ పనుల్లో నాణ్యత పాటించండి

బి.కోడూరు: మండలంలో జరుగుతున్న వాటర్‌షెడ్ పనులను నిబంధనల ప్రకారం నాణ్యతతో చేయాలని వాటర్‌షెడ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెద్దుళ్లపల్లె వాటర్‌షెడ్ పరిధిలో జరిగిన పనులను స్టేట్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపినాథ్, జిల్లా క్వాలిటీ ఆఫీసర్ విజయభాస్కర్, ఏపీఓ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి విడిరాళ్ల కట్టలు, కుంటలు, డకౌట్ గుంతలు, పారంఫండ్స్ వంటి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ సిబ్బంది, పెద్దుళ్ళపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ రాజారెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దుళ్ళపల్లె వాటర్‌షెడ్ పనులను పరిశీలిస్తున్న పీడీ

క్లుప్తంగా

వృద్ధుడు అదృశ్యం


మహబూబ్ సాహెబ్ (ఫైల్)

కడప అర్బన్ : కడప గౌస్ నగర్‌కు చెందిన షేక్ మహబూబ్ సాహెబ్(65)గత నాలుగు రోజులుగా కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయనకు వృద్ధాప్యంతోపాటు మతిస్థిమితం సరిగా లేదని అందులో పేర్కొన్నారు. ఎవరికైనా కనిపిస్తే 8555903070కు సమాచారం ఇవ్వాలని వారు విన్నవించారు.

మైనర్ బాలికకు అంత్యక్రియలు


వైష్ణవి మృతదేహం చూడడానికి తరలివచ్చిన జనం

జమ్మలమడుగు : గండికోటలో హత్య కాబడిన ఇంటర్మీడియట్ విద్యార్థిని వైష్ణవి అంత్యక్రియలు బుధవారం స్వగ్రామం హనుమనగుత్తిలో నిర్వహించారు. మంగళవారం రాత్రి జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి రాత్రి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బుధవారం హనుమనగుత్తిలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్థులు భారీగా తరలి వచ్చి నివాళులర్పించారు.

బాలికను హత్య చేసిన వారిని శిక్షించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఐద్వా, సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : బాలికను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, ఐద్వా నాయకులు గురమ్మ, రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో మహిళల హత్యలు ఎక్కువగా జరుగుతున్నాయని, అభం, శుభం తెలియని చిన్నపిల్లలను చిదిమేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ చదువుతున్న మైనర్ బాలికను యువకుడు లోకేష్ గండికోటకు తీసుకుపోయాడని, అక్కడ ఆమె హత్యకు గురైందని తెలిపారు. ఆమెను ఎవరు హత్య చేశారనేది స్పష్టంగా ఇంతవరకూ బయటికి రాలేదని, రాజకీయాలకు లొంగకుండా ఆమెను చంపిన వారిని పోలీసులు త్వరగా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు లక్ష్మీదేవి, ఝాన్సీరాణి, విజయకుమారి, కళావతి, మేరి, సీతమ్మ, అన్నమ్మపూర్ణ, సీఐటీయూ పట్టణ కార్యదర్శి విజయ్‌కుమార్, సాల్మన్, రాఘవ, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం ములకలచెరువు మండలంలో జరిగింది. ములకలచెరువు రాజా నగర్‌కు చెందిన గంగన్న కుమారుడు నరసింహులు(60) గత కొంతకాలంగా షుగర్, బీపీతోపాటు, కడుపునొప్పితో బాధ పడుతున్నాడు. వ్యాధి నివారణకు చికిత్స తీసుకున్నా ఫలితం కనిపించకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం ఇంటి వద్దే సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కారాగారంలో సెల్‌ఫోన్.. రచ్చ

- పదే పదే లభ్యం కావడంపై డీఐజీ విచారణ
- స్టేట్‌మెంట్ ఇచ్చిన రిమాండ్ ఖైదీ జాకీర్
- 12 మంది బాధ్యులపై చర్యలకు రంగం సిద్ధం
- కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ బదిలీకి అవకాశం?



కడప కేంద్ర కారాగారం

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్ లభ్యం కావడంపై రచ్చ రేగుతోంది. తాను డబ్బులు ఎరవేశానంటూ రిమాండ్ ఖైదీ ఒకరు తెలియజేసినట్లు సమాచారం బయటకు రావడం చర్చనీయాంశమవుతోంది. పలువురు బాధ్యులైన సిబ్బందిపై వేటు వేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఇటీవల సెల్ ఫోన్‌లు పదే పదే తనిఖీలలో లభ్యం కావడం, పత్రికల్లో వార్తలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నెల 15న 'కడప కేంద్ర కారాగారంలో మరోసారి సెల్‌ఫోన్, ఛార్జర్ లభ్యం' వార్త ప్రచురితమైంది. దీంతో జైళ్లశాఖ రాష్ట్ర డీజీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు.. రాజమండ్రి రీజియన్ (నార్త్‌జోన్) డీఐజీ ఎంఆర్ రవికిరణ్ కడప కేంద్ర కారాగారంలో విచారణకు బుధవారం విచ్చేశారు. నేరుగా కారాగారంలోని బ్యారక్‌ల వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పీడియాక్ట్‌లో రిమాండ్‌లో వున్న జాకీర్‌ను పిలిపించి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయించారు. రిమాండ్ ఖైదీ ఏమాత్రం తడబడకుండా «తాను సెల్‌ఫోన్ బయటనుంచి తెప్పించుకోవడానికి జైలర్ నుంచి ఆపై అధికారుల వరకూ డబ్బు ఎర వేశాననీ తెలియజేసినట్లు సమాచారం. కేంద్ర కారాగార సూపరింటెండెంట్ కుమార్తె వివాహానికి వెళ్లేటపుడు అక్షరాలా రూ. 80వేలు నజరానాగా తీసుకువెళ్లాడని, తనకు సహకరించిన జైలర్ నుంచి అధికారి స్థాయి వరకు తాను రూ.7లక్షలు లంచంగా ఇచ్చాననీ తెలియజేసినట్లు తెలిసింది. జాకీర్ నుంచి దశల వారీగా ఇప్పటివరకూ 12 సెల్‌ఫోన్లు, ఛార్జర్ స్వాధీనం చేసుకున్నారు. మొదట దొరికిన సెల్‌ఫోన్ నుంచి లభించిన రిపోర్ట్‌ను డిఐజీ క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిసింది. విచారణలో బాధ్యులైన 12 మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని, కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావుపై బదిలీ వేటు వుండవచ్చని అధికారులు భావిస్తున్నారు. కారాగారం నుంచి బయటకు వెళుతున్న 'ఔట్ గ్యాంగ్ ఖైదీల వద్ద యథేచ్ఛగా మద్యం లభ్యమవుతుందని తాజా సమాచారం. పెట్రోల్ బంకులో ఎలాంటి లాభాలను అక్రమంగా పొందవచ్చో అక్కడ విధులను నిర్వహిస్తున్న ప్రొద్దుటూరు గ్యాంగ్‌లో అరెస్టయి శిక్ష అనుభవిస్తున్న ఓ ఖైదీ మీద ఆధారపడి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్లు సమాచారం. విచారణకు వచ్చిన డిఐజీ ఎం.ఆర్ రవికిరణ్ «సాక్షి»తో మాట్లాడుతూ డీజీ ఆదేశాల మేరకు కడప కేంద్ర కారాగారానికి విచారణకు వచ్చామన్నారు. విచారణ ఇంకా జరుగుతోందనీ, పూర్తి సమాచారం రానున్న రోజుల్లో వివరిస్తామని తెలియజేశారు.

ఉప ఎంపీపీ పదవి వైఎస్సార్‌సీపీ కైవసం


రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న ఎంపీటీసీ బాలనరసింహారెడ్డి


ధ్రువీకరణ పత్రం తీసుకుంటున్న లక్ష్మీదేవి

బాలనరసింహారెడ్డిని ఎన్నుకున్న ఎంపీటీసీలు

చాపాడు : మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్ష పదవి వైఎస్సార్‌సీపీ కైవసమైంది. ఎంపీటీసీ సభ్యులు బాలనరసింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పల్లవోలు ఎంపీటీసీ, మండల ఉపాధ్యక్షురాలు నగర్తి సుందరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ స్థానానికి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయగా ఎన్నికల అధికారి వి.విజయలక్ష్మి ఉప ఎంపీపీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. చియ్యపాడు ఎంపీటీసీ ఎస్ఆర్.బాలనరసింహారెడ్డిని ఉప ఎంపీపీగా మండల అధ్యక్షుడు తెలిదేల లక్ష్మయ్య ప్రతిపాదించగా, చియ్యపాడు-2 ఎంపీటీసీ సుబ్బరామిరెడ్డి బలపరిచారు. వారితోపాటు మరో ఆరుగురు ఎంపీటీసీలు మద్దతు ఇవ్వడంతో బాలనరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీరకిషోర్, ఎంపీటీసీలు చాపాడుఅస్మ, పార్వతమ్మ, ఈశ్వరమ్మ, శివ, సీమోన్, రమాదేవి, అజ్మతుల్లా పాల్గొన్నారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్సార్ బాలనరసింహారెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, జయసుబ్బారెడ్డి, మాజీ ఎంపీటీసీ మహేష్‌యాదవ్, మనోహర్, రమేష్ తదితరులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

సీతారామాపురం ఉప సర్పంచ్‌గా లక్ష్మీదేవి..

మండలంలోని సీతారామాపురం పంచాయతీ ఉప సర్పంచ్‌గా భూమిరెడ్డి లక్ష్మీదేవి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. అనారోగ్యం కారణంగా ఉప సర్పంచ్ గుర్రప్ప తన పదవికి రాజీనామా చేయగా ఎన్నిక కమిషన్ బుధవారం ఈ స్థానానికి ఎన్నిక నిర్వహించింది. ఎన్నికల అధికారి హరికృష్ణ పర్యవేక్షలో జరిగిన ఈ ఎన్నికలో టీడీపీ నాయకులు మార్తల నరసింహారెడ్డి వర్గీయురాలు భూమిరెడ్డి లక్ష్మీదేవిని ఉప సర్పంచ్‌గా వార్డు మెంబర్ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వాతి, పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఆరోగ్య బీమా పొడిగింపు

కడప సెవెన్ రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య బీమా గడువు 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగించిందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారీ రూ.2 లక్షల విలువ చేసే వైద్య సేవలు అందుతాయన్నారు. ఏడాది కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చని, ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని పేర్కొన్నారు. నిర్దేశిత చికిత్సకు ఉచిత ఓపీ సేవలు పొందవచ్చని వివరించారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.జీవోవి.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా హెడ్ ఆఫ్ అకౌంట్ 8342-00-120-01-03-001-001డీడీవో కోడ్ 2703-0802-003 అనే పద్దుకు రూ.1250 చెల్లించి వచ్చే ఏడాది మార్చి 31 వరకు హెల్త్ స్కీం ద్వారా లబ్ధి పొందవచ్చన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజనల్ చలానా, అక్రిడిటేషన్ జిరాక్సు, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫొటోలు, ఆధార్ కార్డు కాపీ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ప్రతిభ గల క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : క్రీడాకారులు ప్రతిభ చూపితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డేనియల్ ప్రదీప్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మెన్ జిల్లా సెలెక్షన్స్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారని, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సుధీర్‌కుమార్, ఎస్.అనిల్ కుమార్, హరి, ఎం.గంగయ్య, తదితరులు పాల్గొన్నారు


జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

సమస్య పరిష్కరించుకునే ప్రక్రియే మధ్యవర్తిత్వం

వన్‌కే వాక్ ర్యాలీలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని


మధ్య వర్తిత్వంపై వన్ కె రన్ ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

కడప అర్బన్ : కక్షి దారుల సమస్యలను పరిష్కరించుకునే ప్రక్రియనే మధ్యవర్తిత్వం అంటారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై కడపలో నిర్వహించిన వన్ కే వాక్ ర్యాలీని బుధవారం పచ్చజెండా ఊపి ఆమె ప్రారంభించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ కూడలి నుంచి న్యాయ సేవా సదన్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అంతకు ముందు ర్యాలీని ప్రారంభించిన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని మాట్లాడుతూ మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కక్షిదారులకు వివరించి స్పష్టంగా ఒప్పంద పత్రాన్ని తయారుచేస్తారని, ఇది అంతరంగికమైన ప్రక్రియ అని వివరించారు. ఈ స్వచ్ఛంద ప్రక్రియకు నిర్దిష్టమైన ఆదేశిక నియమాలు లేవని, ఏడాది పొడవునా చేసుకునే ప్రక్రియ అని వివరించారు. ఈ కార్యక్రమంలో నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు, ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.శాంతి, ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.సి.ఆసిఫా సుల్తానా, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రెటరీ చంద్ర వదన, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ హరిబాబు, మాజీ సైనిక ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య, ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వ న్యాయవాదులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గండి ఉత్సవాలకు పక్కా ప్రణాళిక


మాట్లాడుతున్న ఆలయ అధికారి వెంకటసుబ్బయ్య

చక్రాయపేట : గండిలో శ్రావణ మాసోత్సవాలకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు పాలకమండలి సభ్యులు సహకరించాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి చేశారు. ఉత్సవాల నిర్వహణపై చైర్మన్ కావలి కృష్ణతేజ అధ్యక్షతన గండి క్షేత్రంలోని ఈవో కార్యాలయంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాజగోపురం నిర్మాణం నేపథ్యంలో ఇరుకుగా ఉన్న రోడ్డు వద్ద ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని ఆర్కే వ్యాలీ సీఐ ఉలసయ్యను ఆయన కోరారు. ప్రతి శనివారం భక్తుల రద్దీని బట్టి అద్దాలమర్రి క్రాస్, ఇడుపులపాయ క్రాస్ వద్దే వాహనాలు ఆపేయాలని, ట్రాఫిక్ ఆంక్షలు విధించడమేగాక, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీఐ వివరించారు. ఉత్సవ సమయంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు అందుబాటులో ఉంటామని చక్రాయపేట వైద్యాధికారిణి వాణి చెప్పారు. విద్యుత్తు, నీటి సమస్య, బారికేడ్లు, క్యూలైన్లు, దుకాణాల నిర్వహణ, అలంకరణ, రవాణా సౌకర్యాలు, అగ్నిమాపక శాఖ పాత్రలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కేసరి, రాజా రమేష్, పాలకమండలి సభ్యులు రాశినేని మధు, పబ్బతి బిందుసాగర్, కొండారెడ్డి, మాజీ చైర్మన్ వెంకట స్వామి, అధికారులు పాల్గొన్నారు.

టెండర్లు మళ్లీ వాయిదా

గండి ఆలయ పరిధిలో టోల్‌గేట్ వసూలుకు నిర్వహించిన టెండర్లు మూడో సారీ వాయిదాపడ్డాయి. ధరావత్తు చెల్లించిన వారు వేలం పాడకపోవడంతో నిలిపివేసినట్లు ఈవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శ్రావణ మాసంలో ప్రత్యేక పుష్పాలంకరణ నిమిత్తం పూలు సరఫరా చేసే హక్కు పొందే టెండర్‌కు హెచ్చు పాట పాడిన మల్లికార్జునకు టెండరు ఖరారు చేశామని ఆయన తెలిపారు.

విద్యార్థుల సమస్యలను డీన్‌లకు విన్నవించాలి


మాట్లాడుతున్న ట్రిపుల్ ఐటీ ఏఓ రవికుమార్

వేంపల్లె : విద్యార్థులకు సమస్య ఎదురైనప్పుడు అకడమిక్ అసోసియేట్ డీన్, నాన్ అకడమిక్‌కు అయితే వార్డెన్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలనాధికారి రవికుమార్ అన్నారు. ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కొత్తగా చేరిన విద్యార్థులకు బుధవారం పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈ ఏడాది పీయూసీ-1లో సెమిస్టర్ విద్యా విధానానికి బదులుగా వార్షిక పరీక్షలు, మధ్యలో ఆరు మాసాంత(మిడ్) పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థుల సంరక్షితార్థం ఓల్డ్ క్యాంపస్ మొత్తం పీయూసీ1-2 బాలికలకు కేటాయించామని, అక్కడే తరగతులు, వసతులు ఉండేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బాలురకు ఏబీ-1లో తరగతులు, బీహెచ్-1లో వసతి కేటాయించారన్నారు. పోస్టాఫీస్, బ్యాంకింగ్, 24/7 అంబులెన్స్, హాస్పిటల్ డాక్టర్స్ గురించి వివరించారు. రెండో విడతలో ఎంపికైన విద్యార్థులకు ఈ నెల 17న సెంట్రల్ లైబ్రరీలో కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీన్ అకడమిక్స్ డాక్టర్ రమేష్ కైలాష్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్ , అసోసియేట్ డీన్స్ రాఘవరెడ్డి, రఫి, పీఆర్ఓ తిరుపతిరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శంషాద్ బేగం, ఓబయ్య, డాక్టర్ కార్తీక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ఎస్ఈ రమణ


ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్ : విద్యుత్తు సరఫరాలో అంతరాయం తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ ఆదేశించారు. కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం కడప డివిజనల్ విద్యుత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవాడలో సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఉత్పత్తి అనుకున్నంత మేర జరగదన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్తు భద్రతా నియమాలు పాటించాలని, నిర్లక్ష్య ధోరణి వీడాలని సూచించారు. ఇండక్షన్ టెస్టర్‌ను ప్రతి ఒక్కరూ జేబులో ఉంచుకుంటే విద్యుత్ ప్రవాహాన్ని గుర్తించి ప్రమాదాలు నివారించవచ్చన్నారు. విద్యుత్ సమస్య వచ్చినప్పుడు క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ పరిష్కరించాలని సూచించారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, రీకనెక్షన్ వంటివి వినియోగదారులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులు, అధికారులను సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ హరిసేవ్యా నాయక్, సుబ్రహ్మణ్యం, రామచంద్రారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో ఇంటి స్థలాల కబ్జా


ఇందిరా నగర్‌లో కబ్జాకు గురైన స్థలం

చింతకొమ్మదిన్నె : కడప సమీపంలోని ఇందిరానగర్‌లో ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను కొందరు అధికార పార్టీ నాయకులు కబ్జాకు తెగబడుతున్నారు. అధికారపార్టీ పెద్దల పేర్లు చెప్పి పార్కు, హౌసింగ్, ప్రజావసరాలకు రిజర్వు చేసిన స్థలాలను చదును చేసేస్తున్నారు. తమ సొంత భూముల్లా ప్లాట్లుగా విభజించి అమ్మకానికి పెడుతున్నారు. ప్రభుత్వ స్థలాలు కాపాడాల్సిన కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోతున్నారు. కబ్జాదారులు, అధికార నేతల పేర్లు చెబుతుండటంతో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఇందిరానగర్ వాసులు ఆరోపిస్తున్నారు. సర్వే నెంబర్ 732లో హౌసింగ్‌కు రిజర్వు చేసిన స్థలానికి అధికార పార్టీ నాయకులు బోగస్ డి.పట్టా సృష్టించి ప్లాట్‌లు వేశారు. ఒక్కో రూ.4 లక్షల ధర చెప్పి అమ్మకానికి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ విషయమై బుధవారం సాయంత్రం చింతకొమ్మదిన్నె రెవెన్యూ అధికారుల వివరణ కోరగా తమ దృష్టికి ఇప్పుడే వచ్చిందని, సిబ్బందిని పంపి ప్రభుత్వ స్థలంలో వేసిన ప్లాట్ల రాళ్లను తొలగించడం జరిగిందన్నారు.

సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

బద్వేలు అర్బన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ ఇంజినీరింగ్ కార్మికుల నైపుణ్యం ఆధారంగా వేతనాలు చెల్లించలేదన్నారు. గతంలో సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జీవోలు జారీ చేయకపోవడం సరికాదన్నారు. ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలను ప్రోత్సహించాలనుకోవడం దారుణమన్నారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులను బలవంతంగా పదవీ విరమణ చేయించడం మంచిది కాదన్నారు. బద్వేల్ మున్సిపాలిటీలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, మట్టి ఖర్చు డబ్బులు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. సమస్య పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలకు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు నాగార్జున, వెంకటరమణ, డి.హరి, డి.నాగేంద్రబాబు, దేవమ్మ, చంద్రశేఖర్, నాగరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని వైఎస్ఆర్‌సీపీ నేత అరెస్టు

బెయిల్ మంజూరు చేసిన గుంటూరు సీఐడీ న్యాయస్థానం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఆయన తల్లి భువనేశ్వరిలపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడని పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట సర్పంచ్ అర్షద్ అయూబ్‌బాషాను తిరుపతిలో సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. బుధవారం గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి వాదనలు విన్న తర్వాత నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు. వివరాలిలా ఉన్నాయి. అర్షద్ అయూబ్ బాషా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు మంత్రి లోకేష్‌పై అసభ్యంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వారి పరువుకు భంగం కలిగిస్తున్నాడని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాటి అమరనాథరెడ్డి డీఐజీకి 05-12-2024న ఫిర్యాదు చేశాడు. దీంతో తిరుపతిలో సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. అర్షద్ అయూబ్ తన సొంత పనులపై మంగళవారం తిరుపతి వెళ్లిన విషయం తెలుసుకున్న సీఐడీ పోలీసులు ఆయన్ను అక్కడే అరెస్టు చేసి గుంటూరు సీఐడీ న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయమూర్తి నిందితుడికి బెయిల్ మంజూరు చేశారు.

భార్య చేతిలో భర్త హతం

- రోజూ మద్యం సేవించి వస్తున్నాడని వాగ్వాదం
- ఈ ఘటనలో భార్యతో పాటు, బావమరిది నిందితుడే


సంఘటనా స్థలంలో సుబ్బరాయుడు మృతదేహం

కడప అర్బన్ : రోజూ మద్యం తాగి అనుమానంతో గొడవపడడంతో ఆగ్రహంతో ఊగిపోయిన భార్య గోడకేసి తోసింది.. బలమైన దెబ్బ తగలడంతో భర్త అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కడపలో బుధవారం చోటుచేసుకుంది. కడప వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు..కడప నగరంలోని ఎర్రముక్కపల్లి బాల వికాస్ హైస్కూల్ వెనుక వీధిలో దేరంగుల సుబ్బరాయుడు(32) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య హరిత, కుమార్తె, కుమారుడు వున్నారు. ఈ క్రమంలో సుబ్బరాయుడు ప్రతి రోజూ మద్యం తాగివస్తుండడంతె భార్య హరిత గొడవపడేది. హరిత ఇంటి ప్రక్కనే ఆమె తల్లి, సోదరుడు హరికృష్ణ నివాసముంటున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం రాత్రి 10:30 గంటల సమయంలో దేరంగుల సుబ్బరాయుడు మద్యం తాగి భార్య హరితతో గొడవపడ్డాడు. అదే సమయంలో హరిత అన్న హరికృష్ణ వచ్చి ఎందుకు రోజూ మద్యం తాగి గొడవపడతావని నిలదీశాడు. వాగ్వాదం పెరగడంతో తన భర్తను హరిత గోడకేసి తోసింది. గోడ మోటు బలంగా తగలడంతో సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు మృతుడి భార్య హరిత, బావమరిది హరికృష్ణలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కడప వన్‌టౌన్ సీఐ బి.రామకృష్ణ, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.